సాక్షి అనకాపల్లి

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలో మంగళవారం ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఏఎంసీకి 213 సీట్లు కేటాయించారు.



ముగిసిన పవిత్రోత్సవాలు

సింహాచలం: అప్పన్న పవిత్రోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవమూర్తులను పంచామృతాలు, గంగధారలతో అభిషేకించారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఎఆర్ఎస్ వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 18న 5 మి.మీ, 19న 1, 20న 8, 21న 20, 22న 15 మి.మీ వర్ష పాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

గంజాయి కేసులో 20 సంవత్సరాల జైలు శిక్ష

అనకాపల్లి: జీపులో 16 మూటలతో 620 కేజీల గంజాయి రవాణా చేస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలానికి చెందిన కిల్లో కృష్ణారావుకు అనకాపల్లిలోని అదనపు జిల్లా న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చినట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ చెప్పారు. సీఐ అందించిన వివరాలు.. 2021 సెప్టెంబర్‌లో పట్టణ పోలీస్‌కు అందిన సమాచారం మేరకు అప్పటి ఎస్ఐ బి.సతీష్‌తో పాటు సిబ్బంది అనకాపల్లి జాతీయ రహదారిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న అనుమానాస్పద మహేంద్ర జీపును తనిఖీ చేయగా అందులో 16 మూటలలో 620 కేజీల గంజాయి లభించింది. నిందితుడు కిల్లో కృష్ణరావు జీపును విడిచిపెట్టి వెళ్లిపోవడంతో గంజాయిని అప్పటి సీఐ ఎల్.భాస్కరరావు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డ్రైవర్‌ను 2021 అక్టోబర్ 23న అరెస్టు చేశారు. కేసు విచారణలో వాదోపవాదాలు విన్న అనంతరం న్యాయమూర్తి కిల్లో కృష్ణారావుకు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ చెప్పారు.

హోంగార్డు కుటుంబానికి ఒక రోజు వేతనం



అప్పలరాజు భార్యకురూ.4.15 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు పైలా అప్పలరాజు కుటుంబానికి ఉమ్మడి విశాఖ జిల్లాలోని హోంగార్డులు అండగా నిలిచారు. వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు మృతుడి భార్య కుమారికి స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక మంగళవారం రూ.4,15,815 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అప్పలరాజు అనకాపల్లి జిల్లాలో హోంగార్డుగా పనిచేస్తూ ఇటీవల స్టీల్‌ప్లాంట్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏవో బి.శారదా, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం



ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: కేంద్రం ప్రకటించిన ఖేలో ఇండియా పథకంలో భాగంగా నర్సీపట్నంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. స్టేడియం నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ తయారు చేసేందుకు వచ్చిన అధికార యంత్రాంగంతో స్పీకర్ మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిలోనే స్పోర్ట్స్ శిక్షణ సంస్థ ఉంటుందన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ శిక్షణ తీసుకునేందుకు వీలుగా ఇండోర్ స్టేడియంను నిర్మిస్తున్నామన్నారు. ఎంపీ సీఎం రమేష్ సహకారంతో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో స్కేటింగ్ రింక్‌ను సిద్ధం చేస్తామన్నారు. గతంలో మాదిరి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలను నిర్వహిస్తామన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: నిర్మాణ రంగానికి ఆద్యుడు విశ్వకర్మ అని, ఆయన సిద్ధాంతాలే నేటికీ అనుసరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో మంగళవారం విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయనతోపాటు విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.గంగారావు, ప్రధాన కార్యదర్శి చేబోలు సూరిబాబు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్వరి, బీసీ కార్పొరేషన్ అధికారులు, విశ్వ బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలు బంద్



మాకవరపాలెం పీహెచ్‌సీలో వైద్యుల కోసం వేచివున్న రోగులు

- జీవో 85 రద్దు చేయాలంటూ వైద్యుల సమ్మెబాట
- వేలాదిమంది రోగులకు నిలిచిన సేవలు
- స్టాఫ్ నర్సులతోనే అరకొర వైద్యం



రేగుపాలెం పీహెచ్‌సీలో రక్త పరీక్షల గది

సాక్షి, అనకాపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైద్యసేవలు పూర్తిగా బంద్ అయ్యాయి. తమకు వ్యతిరేకంగా ఉన్న జీవో నంబర్ 85ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులంతా వారం రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లే ఉంది తప్ప ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం వారం రోజులకు ముందే జీవో 85కు వ్యతిరేకంగా ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు విధులకు ఆటంకం కాకుండా ఆందోళన చేస్తామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వారం రోజుల నుంచి విధులకు ఆటంకం లేకుండా, రోగులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా నిరసన తెలిపినా.. రాష్ట్ర ప్రభుత్వం జీవోపై వెనక్కి తగ్గకపోవడంతో ఆందోళనను ఉధృతం చేశారు. మంగళవారం నుంచి పీహెచ్‌సీల్లో పూర్తిగా వైద్యసేవలు బంద్ చేసి..''చలో విజయవాడ'కు తరలి వెళ్లారు. దీంతో పీహెచ్‌సీలకు వచ్చిన రోగులను స్టాఫ్ నర్సులే చూసి, సీహెచ్‌సీ వైద్యుల సలహా మేరకు మందులు ఇస్తున్నారు.

అత్యవసరమైతే సమీప సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. సీజనల్ జ్వరాలు, ఇతర వ్యాధుల కోసం వచ్చే రోగులు వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వైద్యులు లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారు. ఇల్లు గడవని పేదలెందరో వైద్యం కోసం పీహెచ్‌సీలకు వచ్చి వైద్యం అందకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వదిలించుకుంటున్నారు.

వారం రోజులపాటు నిరసన

గ్రామీణ ప్రజలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఒకవైపు వైద్యసేవలందిస్తూ.. మరోవైపు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85ను రద్దు చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 10న విధులకు ఆటంకం లేకుండా వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 11, 12 తేదీల్లో సేవలలో అంతరాయం లేకుండా నిరసన కొనసాగించారు. ఈ రెండు రోజులు ప్రభుత్వం చర్చలకు వస్తుందని ఎదురు చూశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో తరువాత రోజు అత్యవసర సేవలకు ఆటంకం కాకుండా ఉన్నతాధికారులకు తెలియజేశారు. సెప్టెంబర్ 14న పీహెచ్‌సీ సేవలు కేవలం అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితమై..ఓపీలను బంద్ చేశారు. సెప్టెంబర్ 16వ తేదీ వరకు నిరసన కొనసాగించారు. అయినా జీఓ 85 రద్దు చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా చలో విజయవాడకు బయలుదేరి సమ్మె ఉధృతం చేశారు.

ఏరియా, సీహెచ్‌సీల్లో అత్యవసర వైద్యం

పీహెచ్‌సీలో వైద్యులు సమ్మెబాట పట్టడంతో అత్యవసర సేవల కోసం సీహెచ్‌సీ ఆసుపత్రికి వెళ్లాలని విజ్ఞప్తి చేశాం. సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో ఓపీ సమయం పెంచాం. 24 గంటలూ వైద్యులను అందుబాటులో ఉంచాం. ఏరియా, సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో వైద్యులకు సెలవులు రద్దు చేసి.. వైద్యసేవలందించాలని ఆదేశించాం. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువగా రోగులు పీహెచ్‌సీలకే వస్తుంటారు. పీహెచ్‌సీల్లో వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులు, సచివాలయ ఏఎన్ఎంల ద్వారా సీహెచ్‌సీలకు వెళ్లేలా అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ బాలాజీ, డీఎంహెచ్ఓ, అనకాపల్లి



యలమంచిలి మండలం రేగుపాలెం పీ హెచ్ సీలో ఖాళీగా ఉన్న వైద్యురాలి గది

జిల్లాలో పీహెచ్‌సీలు	40
యూపీహెచ్‌సీలు	10
వాటిలో పనిచేసే వైద్యుల సంఖ్య	124
జిల్లాలో రోజుకు ఓపీకి వచ్చే సగటు రోగులు	6 వేలు
ఇన్‌పేషెంట్లు	3 వేలు

జీవో 85లో ఏముందంటే..!

కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే జీవో 85ను తీసుకొచ్చారు. గతంలో పీహెచ్‌సీలో పనిచేసే ఎంబీబీఎస్ డాక్టర్లకు పీజీ సీటుల్లో 30 శాతం కోటా ఉండేది. దాన్ని 15 శాతానికి తగ్గిస్తూ కూటమి ప్రభుత్వం జీవో 85ను తీసుకొచ్చింది. దీంతో పీహెచ్‌సీలలో పనిచేసేందుకు ఎంబీబీఎస్ డాక్టర్లు మొగ్గు చూపే అవకాశం తగ్గిపోతుంది. అదేకాకుండా పీజీ వైద్య సీట్లలో నాలుగు కోర్సులకు మాత్రమే ఆ 15 శాతం కోటా కూడా ఉంటుంది. అది కూడా ప్రభుత్వం ఇచ్చిన నాలుగు స్పెషలైజేషన్‌లోనే 15 శాతం కోటా ఇస్తారు

ప్రభుత్వం స్పందించే వరకు దీక్ష కొనసాగిస్తాం..



వారం రోజులుగా రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిరసన తెలియజేశాం. అయినా ప్రభుత్వం మాపట్ల చిన్నచూపు చూస్తోంది. కరోనా లాంటి సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించాం. పీహెచ్‌సీల్లో పనిచేసేది ప్రభుత్వం, ప్రజల కోసమే. ప్రజలకు వైద్యసేవలందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులంటే ప్రభుత్వానికి ఎందుకంత చులకన. తక్షణమే జీవో 85ను రద్దు చేసి.. యధావిధిగా మాకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వైద్యుల సంఘం డిమాండ్ చేస్తోంది.

– డాక్టర్ తిరుపతిరావు, జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకుడు

తల్లి పేరుతో మొక్క నాటండి



కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక

తుమ్మపాల: జిల్లాలో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ కోరారు. మొక్కల పెంపకంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఆమెతో పాటు ఎస్పీ ఎం.దీపిక మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంతో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సందీప్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024–25 విద్యా సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి నాలుగో విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27 సాయంత్రం 3 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. ప్రవేశాలకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కన్వీనర్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వచ్ఛత హీ సేవా స్ఫూర్తితో పరిసరాల పరిశుభ్రత

అనకాపల్లి: స్వచ్ఛత హీ సేవా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. తుమ్మపాల గ్రామంలో స్వచ్ఛత హీ సేవ–2024 పక్షోత్సవాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. శుద్ధి చేసిన నీటిని తీసుకోవాలని ఆమె సూచించారు. పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఇళ్ల వద్ద ఓ మొక్కను నాటి పెంచాలని కోరారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అంతకు ముందు తుమ్మపాల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే చీపురుపట్టి రోడ్డును శుభ్రం చేశారు.

స్థానిక ప్రజలకు తడి, పొడి చెత్త బుట్టలను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషా రాణి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



తుమ్మపాల గ్రామంలో చీపురుపట్టి రోడ్డు శుభ్రం చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

నిర్వాసితుల సమస్యలకు 15 రోజుల్లోగా పరిష్కారం

- కలెక్టర్ విజయ కృష్ణన్ హామీ
- విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ బాధితులతో ప్రత్యేక గ్రీవెన్స్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నిర్వాసితులు

నక్కపల్లి: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులు, నిర్వాసితుల సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని కలెక్టర్ విజయ కృష్ణన్ హామీ ఇచ్చారు. నష్టపరిహారం చెల్లించకుండా, తమ సమస్యలు పరిష్కరించకుండా ఏపీఐఐసీ కోసం సేకరించిన భూముల్లో చేపట్టిన పనులను రైతులు, నిర్వాసితులు అడ్డుకున్న విషయం తెలిసిందే. భూములు ఇచ్చిన రైతులకు ఇంకా పరిహారం చెల్లించాల్సి ఉందని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. పనులు అడ్డుకున్న రైతుల సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నక్కపల్లి మండలంలో చందనాడ, రాజయ్యపేట, అమలాపురం, వేంపాడు, బుచ్చిరాజుపేట తదితర గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యారు. చందనాడ సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూరాకాసుల గోవిందు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, బాధిత రైతులు కలెక్టర్‌కు తమ డిమాండ్లు, పరిష్కరించాల్సిన సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, భూములు స్వాధీనం చేసుకునే సమయానికి బాధిత రైతుల కుటుంబాల్లో మేజర్లకు రూ.15 లక్షల నష్టపరిహారం, ఇళ్లు కోల్పోయినవారికి నష్టపరిహారం కింద రూ.25 లక్షలు, పునరావాసం, అలాగే ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు, దళితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. స్థానికంగా ఏర్పాటు చేసే కంపెనీల్లో స్థానికులకు, భూములు ఇచ్చిన కుటుంబాల్లో వారికి పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారణ జరిపి తమ పరిధిలో ఉన్న సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని, మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఎస్‌డీసీ రమామణి, నక్కపల్లి తహసీల్దార్ అంబేద్కర్, బుచ్చిరాజుపేట సర్పంచ్ కాళ్ల శ్రీను, రైతు నాయకులు తళ్ల అప్పలస్వామి, పుణ్యమంతుల బాబ్జీ, వంకా కృష్ణ, జి.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

తవ్వరా.. మనల్ని అడ్డుకునేదెవరు!..

- ప్రభుత్వం మనది.. ఇసుకా మనదే..
- వరాహనదిలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- కూటమి నాయకుల బరితెగింపు



మామిడి తోటలో టీడీపీ నాయకుడి ఇసుక నిల్వ



తోటలో మరోపక్క జనసేన నాయకుడి ఇసుక నిల్వ


కోటవురట్ల: వరాహనది సాక్షిగా ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు. అడ్డగోలుగా ఇసుక తవ్వకాలతో జేబు నింపుకుంటున్నారు. వాల్టా చట్టాన్ని తుంగలోకి తొక్కి నిబంధనలకు పాతరేసి వరాహనదీ గర్భాన్ని చీల్చి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. మూడు మండలాల పరిధిలోని 37 గ్రామాలకు తాగునీరును అందించే పైలట్ ప్రాజెక్టుకు సమీపంలోనే తవ్వకాలు జరిపి, జంకూ బొంకూ లేకుండా నేరుగా మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న మామిడితోటలో ఇసుక నిల్వ చేసి లారీల ద్వారా విక్రయాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు మిన్నకుండిపోవడం గమనార్హం. గొట్టివాడ శివారు పైలట్ ప్రాజెక్టు సమీపంలో వరాహనదిలో కూటమి నాయకులు అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం రక్షిత మంచినీటి పథకాలు, వంతెనలు, గ్రోయిన్లకు వంద మీటర్ల పరిధిలో ఎటువంటి ఇసుక తవ్వకాలు జరపకూడదు. కానీ కూటమి నాయకులు బరితెగించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమార్జనకు తెరలేపారు. కంటికి కనిపించినదంతా మనసొత్తే అన్నట్టుగా కొండలు తవ్వి గ్రావెల్‌ను, నదిలో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రామచంద్రపురం శివారు గూడెపులోవ గ్రామానికి టీడీపీ, జనసేన నాయకులు వేర్వేరుగా రెండు స్టాక్ పాయింట్లు పెట్టి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.

పైలట్ ప్రాజెక్టుకు సమీపంలోనే ఇసుకను తవ్వి నాటుబళ్ల ద్వారా ఒడ్డుకు చేర్చి మామిడి తోటలో వేర్వేరుగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు.

రాత్రి కాగానే లారీల ద్వారా పట్టణాలకు తరలించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. ఈ స్టాక్ పాయింట్లు నేరుగా మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న మామిడి తోటల్లో ఏర్పాటు చేయడం వారి బరితెగింపునకు నిదర్శనం. మామిడి తోటలో నుంచి వరాహనదిలోకి బాటను ఏర్పాటు చేసి నది నుంచి ఇసుకను కొల్లగొడుతున్నారు. ఏ రోజు తవ్విన ఇసుకను ఆ రోజే లారీల ద్వారా తరలించేసి ఆనవాలు లేకుండా చేస్తున్నారు. ఇందుకు ఎవరికి ముట్టాల్సిన ముడుపులు వారికి చేరుతున్నాయన్న ఆరోపణలు వున్నాయి.

పైలట్ ప్రాజెక్టుకు ముప్పు

వరాహనదిలో అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా పైలట్ ప్రాజెక్టు మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. నదిలో తవ్వకాలు జరపడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి మంచినీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు సంబంధించి 37 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఇసుక తవ్వకాలను నిరోధించకపోతే వేసవిలో తాగునీటికి కటకట తప్పదని నిపుణులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే ముప్పు తప్పదంటున్నారు. పైలట్ ప్రాజెక్టు సమీపంలో జరుగుతున్న ఇసుక దందాపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగభూషణం వివరణ కోరగా ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని, పరిశీలించి ఇదే అంశంపై తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.



వరాహనదిలో ఉన్న పైలట్ ప్రాజెక్టు

తాండవ కాలువకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

నాతవరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన తాండవ ఎడమ కాలువకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు. వరద నీటి ప్రవాహానికి కాలువ గట్టు దెబ్బతింది. ఆయకట్టకు ఈ కాలువ ద్వారా నీరు విడుదల చేయడంతో మరింత కోతకు గురైంది. దీంతో స్పందించిన ప్రాజెక్టు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పంట పొలాలకు ప్రవహిస్తున్న కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించి ఇసుక బస్తాలు, కర్రలు అడ్డుగా పెట్టి పనులు చేపట్టారు. ఈ కాలువ కోతకు గురైతే నాతవరం, కోటవురట్ల, నర్సీపట్నం మండలాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు నిలిచిపోయే ప్రమాదం ఉంది. దీనిని ముందుగా గ్రహించిన తాండవ ప్రాజెక్టు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దీనిపై జేఈ రామకృష్ణ మాట్లాడుతూ కాలువ కోతకు గురైన విషయం తెలియడం ఆలస్యమైతే మూడు మండలాల పరిధిలో ఖరీఫ్ పంట సాగుకు నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు.



కాలువ పనులు పరిశీలిస్తున్న ప్రాజెక్టు జేఈ రామకృష్ణ

ఇక ఎకో సిస్టమ్‌కు హెల్త్‌కార్డులు

- చిత్తడి నేలలు, అడవుల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- ఎన్‌సీఎస్‌సీఎం డైరెక్టర్ డా.రామచంద్రన్ వెల్లడి



ఎన్‌సీఎస్‌సీఎం డైరెక్టర్ రామచంద్రన్‌తో వివిధ సంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: అటవీ వ్యవస్థను సంరక్షిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా దేశవ్యాప్తంగా ఎకోసిస్టమ్‌కు హెల్త్‌కార్డులు నిర్వహించే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డా.పూర్వాజ రామచంద్రన్ తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ ఎడ్యుకేషన్, ఎన్‌సీఎస్‌సీఎం సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రిపరేషన్ ఆఫ్ ఎకోసిస్టమ్ హెల్త్‌కార్డు' పేరుతో విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మూడు రోజుల సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన డా.రామచంద్రన్ మాట్లాడుతూ పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అటవీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తూ ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న అటవీ వ్యవస్థ స్థితిగతులపై చర్చించడంతోపాటు దేశంలో భూ–వినియోగ మార్పులు, స్థిరమైన అభివృద్ధి, చిత్తడి నేలలు.. ఇలా ప్రతి పర్యావరణ వ్యవస్థకు హెల్త్‌కార్డులు రూపొందించే పద్ధతులపై చర్చిస్తున్నామని తెలిపారు.

ఎన్.నర్సాపురం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

- కార్యదర్శి సస్పెన్షన్
- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

నక్కపల్లి : పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారన్న కారణంగా మండలంలో ఎన్.నర్సాపురం సర్పంచ్ నాగమణి చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల వినియోగానికి సంబంధించి రికార్డులు సరిగా నిర్వహించకపోవడం, సరైన పర్యవేక్షణ చేయకపోవడం కారణంగా పంచాయతీ కార్యదర్శి కె.బాబూరావును సస్పెండ్ చే సినట్టు ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు. ఎన్.నర్సాపురం పంచాయతీలో సాధారణ నిధులు నిబంధనల మేరకు ఖర్చు చేయలేదని, సుమారు రూ.36 లక్షలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు, పంచాయతీ తీర్మానాలు లేకుండా సర్పంచ్ ఇష్టానుసారం ఖర్చు చేశారంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన డీపీవో సర్పంచ్ చెక్ పవర్ 90 రోజుల పాటు రద్దు చేయడంతో పాటు, కార్యదర్శిని సస్పెండ్ చేశారని ఈవోపీఆర్డీ తెలిపారు. సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆమె ఇచ్చే సంజాయిషీ బట్టి తదుపరి చర్యలు ఉంటాయని డీపీవో జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫార్మా కార్మికులకు భద్రత కల్పించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం
- రాంబిల్లి మండలంలో ఫార్మా కార్మికుల భద్రతపై రక్షణ యాత్ర



మూలజంప గ్రామంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి (యలమంచిలి): ఎస్‌ఈజెడ్ ఫార్మా పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్యాలు భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సెజ్ ఫార్మా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని కోరుతూ సీపీఎం నేతలు చేపట్టిన రక్షణ యాత్ర యలమంచిలి మండలం నుంచి రాంబిల్లి మండలంలో మూలజంప గ్రామంలోకి మంగళవారం మధ్యాహ్నం చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం నేతలు కె.లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభావతి, కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌ఈజెడ్‌లోని వివిధ ఫార్మా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విధులకు వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి చేరుకునే వరకూ కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కార్మికుల రక్షణ కోరుతూ బైక్ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఫార్మా పరిశ్రమలు వ్యర్థ జలాలను ఫిల్టర్ ఇన్ చేయకుండా రాత్రి సమయంలో గాలిలోకి నీటిలోకి వదిలేస్తున్నారని, వాటి ప్రభావం వల్ల స్థానికులు క్యాన్సర్, కిడ్నీ వంటి వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. లాలం కోడూరు గ్రామంలో జీవించడమే మరణంగా ఉందని, మన జిల్లాలో 25 సంవత్సరాలుగా జరిగిన పారిశ్రామిక ప్రమాదాల్లో గత నెల 21న రాంబిల్లి ఎసైన్షియా ఫార్మా ప్రమాదం పెద్దది అన్నారు. పరిశ్రమ యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 17 మంది కార్మికులు ప్రాణాలు పోయాయని, మరో 38 మంది కార్మికులు తీవ్ర గాయాలు పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇటీవల వివిధ పరిశ్రమల్లో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మరణిస్తే, మన అనకాపల్లి జిల్లాలో ఆరేళ్లలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది చనిపోయారని 92 మంది గాయాలపాలయ్యారని, లెక్కకురానివి ఎన్నో ఘటనలు ఉన్నాయన్నారు. ఎస్‌ఈజెడ్‌లో కంపెనీలు భూములు, నీరు, కరెంట్ వంటి మౌలిక వసతులు, రుణాలు అనేక రాయితీలు ప్రభుత్వాల ప్రజల నుంచి పొందుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల వ్యాపారాల కోసం నిబంధనలను కుదించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఫ్యాక్టరీలు తనిఖీ చేయకుండా అధికారులపై ఆంక్షలు విధించడంతో ఈ ప్రమాదాలు మరింత పెరగడానికి ప్రధాన కారణమయ్యాయని ఆరోపించారు. 2016లో కేంద్ర ప్రభుత్వం కంప్యూటర్ ఆధారిత తనిఖీల విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 62 తీసుకొచ్చి రెగ్యులర్ తనిఖీలు చేయడం మానేశాయన్నారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కంపెనీలపై వేధింపులు వద్దనే పేరుతో పాలకులే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, లేబర్ డిపార్ట్‌మెంట్ ఫైర్, బాయిలర్ చెకింగ్ చేసే శాఖల పర్యవేక్షణ కొరవడిందన్నారు. ఫార్మా పరిశ్రమల్లో తరచూ తనిఖీలు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

కోట్లాది రూపాయలు లాభాలను పరిశ్రమ యాజమాన్యాలు ఆర్జిస్తున్నాయని, టెక్నాలజీ అభివృద్ధి చెందినా ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీని వల్ల పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకొని కార్మికులు ప్రాణాలు పోయి, క్షతగాత్రులు అవుతున్నారని వాపోయారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంబిల్లి సీపీఎం నాయకులు జి.దేముడు నాయుడు, రామకృష్ణ, రాము, నూకన్న శివాజీ, అప్పారావు, వెంకునాయుడు, సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు శ్రీ ప్రకాష్ విద్యార్థులు



శ్రీ ప్రకాష్ విద్యార్థులతో బోధన సిబ్బంది

పాయకరావుపేట: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. సీబీఎస్‌ఈ బోర్డు ఆధ్వర్యంలో నల్గొండలోని ఏకశిల ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ స్కూల్లో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు క్లస్టర్ -7 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. 400 మీటర్ల రిలే అండర్ – 19 విభాగంలో ఫేస్ -1, 2 శ్రీ ప్రకాష్ విద్యార్థులు (వై.జయ సత్యకుమార్, ఆదిత్యకుమార్, ఎల్.పూర్ణ శ్యామ్ నాయుడు, శాశ్వత్ ప్రేమ్, ఎండీ సునీల్ కుమార్) ప్రథమ స్థానంలో నిలిచారు. జావెలిన్ త్రో విభాగంలో ఆదిత్యకుమార్ 40.90 మీటర్లు విసిరి బంగారు పతకం సాధించాడు. 5 వేల మీటర్ల రన్నింగ్ పోటీల్లో ఎండీ సునీల్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించాడు. వీరంతా అక్టోబర్ 6 నుంచి 8వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ వారణాసిలోని సెయింట్ అతులానంద్ కాన్వెంట్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్ శ్రీరామాంజనేయులు తదితరులు అభినందనలు తెలిపారు.

ఆప్టా జిల్లా అధ్యక్షుడిగా చిన్నారావు



ఆప్టా జిల్లా నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు

అనకాపల్లి: ఏపీ ప్రైమరీ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షుడిగా బోయిన చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఉడ్‌పేట ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఆప్టా ఎన్నిక నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.షణ్ముఖరావు, ఆర్థిక కార్యదర్శిగా చల్లా నాగేశ్వరరావుతోపాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరావు మాట్లాడుతూ జీవో నంబర్ 117ను రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో కలిపిన 3, 4, 5 తరగతులను తిరిగి పాత పాఠశాలలకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్టా మాజీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సరోజిని, విజయ్‌కుమార్, త్రినాథ్, రామారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శివుడి విగ్రహ ధ్వంసంపై ఫిర్యాదు



గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో పాక్షికంగా ధ్వంసమైన శివుడి విగ్రహం

గొలుగొండ: ప్రముఖ శైవక్షేత్రం ధారమఠం శివాలయం వద్ద శివుడు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి ఇక్కడ శివుడు విగ్రహం చేతి, మెడలో పాము, ముక్కు, శివలింగం భాగాలను పగులగొట్టారు. మంగళవారం ఉదయం పూజారి గుడికి వెళ్లి పూజలు చేసే సమయంలో విగ్రహ ధ్వంసం చేసినట్టు గుర్తించి ఆలయ ఈవో దివ్యతేజకు సమాచారం ఇచ్చారు. ఆమె గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆలయ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ఈవోతో పాటు భక్తులు కోరుతున్నారు.

‘మధ్యాహ్న భోజనం’లో నాణ్యత తప్పనిసరి

- గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్లో కలెక్టర్ విజయ కృష్ణన్ తనిఖీ



గాంధీనగరం హైస్కూల్‌లో భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. స్థానిక గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్లో మంగళవారం ఆమె మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల ఆవరణలో వేడి భోజనం పెట్టాలన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం అక్కడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో బాలాజీ, ఉపాధ్యాయులు, ఉన్నారు.

‘ఆవాస్’ లబ్ధిదారులకు ఇళ్ల తాళాల అప్పగింత



లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అప్పగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే బండారు

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ సొంతిళ్లు కలిగి ఉండాలనే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటి స్థలాలతోపాటు, నిర్మాణ ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేసి పేదలకు అండగా ఉంటున్నాయని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒడిశాలో భువనేశ్వర్ నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 మార్గదర్శకాలను వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టరుతో పాటు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని ప్రధాని ప్రారంభ కార్యక్రమాన్ని లబ్ధిదారులతో కలిసి వీక్షించారు. అంతకుముందు జిల్లాలోని లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందజేశారు. జిల్లా హౌసింగ్ పీడీ వై. శ్రీనివాసరావు, అధికారులు, వి. సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై సీరియస్



నరికిన చెట్ల దుంగలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, అధికారులు



చెట్ల దుంగలను ఈడ్చుకుని తీసుకెళ్లడంతో దెబ్బతిన్న రోడ్డుపై కాంక్రీటుతో పూడ్చిపెట్టిన గుంత

యలమంచిలి రూరల్: రోడ్లు, భవనాల శాఖ స్థలంలో చెట్ల నరికివేత వ్యవహారాన్ని ఆ శాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఇందుకు బాధ్యులపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని యలమంచిలి ఆర్‌అండ్‌బీ ఏఈఈ ఎం. సత్యవాణి మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యలమంచిలి పట్టణానికి సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన తన వెంచర్‌కు రహదారి ఏర్పాటు చేసుకోవడానికి అధికార పార్టీకి చెందిన ఓ రియల్టర్ ఆర్‌అండ్‌బీ స్థలంలో 50 ఏళ్ల నాటి భారీ నిద్రగన్నేరు చెట్టు, మూడు తాటిచెట్లను అక్రమంగా నరికి వేయించినట్టు పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు స్పందించారు. యలమంచిలి ఆర్‌అండ్‌బీ డీఈఈ విద్యాసాగర్, ఏఈఈ సత్యవాణి, సిబ్బంది అక్కడ చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు చెప్పగా, పరిశీలించిన ఆయన చెట్లు నరికించిన వ్యక్తి తమకు బాగా కావాల్సినవాడైనా ఇది తప్పేనన్నారు. నిబంధనల ప్రకారం ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విశాఖపట్నం-విజయవాడ జాతీయ రహదారి పక్కన 329/0-2 కిలోమీటరు వద్ద తమ శాఖకు చెందిన స్థలంలో ఎస్.రాయవరం మండలం వెలంపాలెం గ్రామానికి చెందిన వజ్రపు శంకర్రావు అనుమతి లేకుండా చెట్లను నరికివేయించినట్టు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో ఏఈఈ పేర్కొన్నారు. నరికిన దుంగలను ఎదురుగా ఇరిగేషన్ కాలువలోకి ఈడ్చుకుపోయినప్పుడు రోడ్డు దెబ్బతిన్న విషయాన్ని ఫిర్యాదులో పేర్కొనకపోవడం గమనార్హం. దెబ్బతిన్న బీటీ రోడ్డుపై సిమెంటు కాంక్రీటు వేసి గుంతను ఇద్దరు కూలీలతో పూడ్చివేయించారు.

వరిలో సుడిదోమ ఆశించే అవకాశం

- అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులకు వరిలో సుడిదోమ ఆశించే అవకాశం ఉందని నివారణకు బుప్రోఫుజిన్ 1.6 మి.లీ లేదా, అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో ఆయన సమావేశమై ఆయన మాట్లాడారు. వరిపైరులో జింకులోపం కనిపించే అవకాశం ఉందని, నివారణకు 2 గ్రాముల జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకు ముడత పురుగు ఆశించినట్లయితే 2.5 మి.లీల క్లోరిఫైరిఫాస్ లేదా 0.3 మి.లీల క్లోరాంత్రనిలిప్రోల్ మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని చెప్పారు. 30 రోజుల నాటిన లేదా నేరుగా విత్తిన వరి పొలంలో కలుపు నివారణకు ఎకరానికి 8 గ్రాముల మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10శాతం క్లోరిమ్యురాన్ ఇథైల్ 10 శాతం (ఆల్మిక్స్)ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 40 నుంచి 45 రోజుల రాగి పైరులో 26 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలన్నారు. చెరకులో పసుపు ఆకుతెగులును వ్యాప్తి చేసే రసం పీల్చు పురుగుల ఉధృతి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. 30 నుంచి 50 రోజుల వయసు గల కందిపైరులో తేమను ఉపయోగించుకుని అంతర కృషి చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు మిరపలో తామర పురుగుల ఆశించవచ్చని, డైమిథోయేట్ మందును 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, బి.భవాని, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

వీఆర్పీపై చర్యలు తీసుకోవాలి



గ్రామ సభలో వీఆర్పీ అవకతవకలపై ఫిర్యాదు చేసి అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

రోలుగుంట : మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులు, నిధులు మంజూరుకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఎం.కె.పట్నం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తులు వీఆర్పీపై ఫిర్యాదు చేశారు. పనుల నిర్వహణ, కూలీ డబ్బుల మంజూరు, పనిచేయని వారి పేరున కూలి వేతనం మంజూరు వంటి పలు అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. ఏడేళ్లుగా వీఆర్పీగా దేవుడుబాబు విధులు నిర్వహిస్తూ ఏకపక్షంగా తనకు నచ్చిన వారికే పని కల్పిస్తూ అసలైన పేదలకు అన్యాయం చేస్తున్నారని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితులు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సూర్యామణి, సామాజికి తనిఖీ బృందానికి ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, వారి ఫిర్యాదుపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.

సెయిల్‌లో గైస్ విద్యార్థికి కొలువు

- 10.4 లక్షల ప్యాకేజీతో రికార్డు



ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణతో కలిసి తన నియామక పత్రాన్ని చూపుతున్న చైతన్యకుమార్

మురళీనగర్(విశాఖ): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) విద్యార్థి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్)లో కొలువు సాధించారు. 2020-2023 బ్యాచ్‌కు చెందిన జి.చైతన్యకుమార్ సెయిల్ నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ మేరకు చైతన్య కుమార్‌ను ఆపరేటర్ కమ్ టెక్నికల్ ట్రైనీ ఉద్యోగానికి రూ.10.4 లక్షల వార్షిక ప్యాకేజీతో సెయిల్ సంస్థ ఎంపిక చేసింది. పాలిటెక్నిక్ విద్యతో పది లక్షల ప్యాకేజీ సాధించడం ఒక రికార్డుగా చెప్పుకోవచ్చు. సామాన్య కుటుంబంలో జన్మించిన చైతన్య ఈ ఘనత సాధించడంతో అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఆనందపురం మండలం గుమ్మిడివానిపాలేనికి చెందిన అతని తండ్రి రవికుమార్ సామాన్య రైతు. తల్లి జి.లక్ష్మి గృహిణి. చైతన్య మంగళవారం గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను కలిసి తన ఆనందాన్ని పంచుకున్నాడు. ప్రతి డిప్లమా విద్యార్థి చైతన్యకుమార్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు.

ప్రపంచ బ్యాంకు మాటైనా వినండి చంద్రబాబూ

- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ

అల్లిపురం(విశాఖ): అమరావతి రాజధానిగా పనికిరాదని ప్రపంచ బ్యాంకు చెప్పిన మాటైనా చంద్రబాబు వినాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ హితవు పలికారు. వరదలకు మునిగిపోయిన అమరావతి చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాన్ని రాజధానిగా అంగీకరించేది లేదని, అందువల్ల ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో చంద్రబాబు తన ప్రయత్నాలనున విరమించుకోవాలని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2014లో ఆనాటి కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుత జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ, ఆనాటి సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తాను కలిసి మేధావులతో నిర్వహించిన సెమినార్‌లో శివరామకృష్ణ రిపోర్టు ఆధారంగా 56 రకాల పంటలు పండే భూములను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాజధానిగా విశాఖపట్నం అన్నివిధాలా అర్హతగలదని ఆంధ్రప్రదేశ్ ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాకవరపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కొండల అగ్రహారం నుంచి అనుమతులు లేకుండా నర్సీపట్నం ఇసుకను తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్ఐ దామోదర్‌నాయుడు మంగళవారం తెలిపారు. వీటిలో రెండు ట్రాక్టర్లకు రూ.10 వేల చొప్పున జరిమానా వసూలు చేశామన్నారు. మిగిలిన ట్రాక్టర్‌కు కూడా జరిమానా వసూలు చేసి వాటిని విడిచి పెడతామన్నారు.

శారదానదిలో పడి రైతు మృతి

- వై.లోవ గ్రామంలో ఘటన



మృతి చెందిన రైతు బాబూరావు

రాంబిల్లి (యలమంచిలి): శారదానదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి రైతు మృతి చెందాడు. రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపిన వివరాల ప్రకారం... రాంబిల్లి మండలం వై.లోవ గ్రామానికి చెందిన బద్ది బాబూరావు (55) ఆదివారం ఉదయం గ్రామ సమీపంలో శారదానదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడి గల్లంతయ్యాడు. బాబూరావు ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు రాంబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శారదానదిలో మునిగిపోయినట్లు స్థానికులు తెలపడంతో మంగళవారం రాంబిల్లి పోలీసులు, గ్రామస్తులు నదిలో పుట్టీల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నేవీ గేట్ సమీపంలో మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పురుగు మందు తాగి వృద్ధుడి మృతి



మృతిచెందిన రామునాయుడు

కె.కోటపాడు : కొరువాడ జగన్నాథపురం గ్రామానికి చెందిన వృద్ధుడు చిరికి రామునాయుడు(74) పురుగు మందును తాగి చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అతని మృతిపై భార్య యర్రయ్యమ్మ ఎ.కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. రామునాయుడు సోమవారం రాత్రి 8 గంటలవుతున్నా పాక వద్ద నుంచి ఇంటికి రాలేదు. దీంతో భర్త కోసం యర్రయ్యమ్మ పాక వద్దకు వెళ్లి చూడగా పురుగు మందు డబ్బా ఆయన పక్కన ఉండడాన్ని గమనించింది. భర్త అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే ఆమె కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకువెళ్లింది. ప్రథమ చికిత్సను అందించినా అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సోమవారం రాత్రి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామునాయుడు పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో రామునాయుడు ఇబ్బందులు పడుతున్నట్టు భార్య యర్రయ్యమ్మ తెలిపిందని ఎ.కోడూరు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. నాలుగు రోజులుగా శ్వాసకోశ సంబంధిత సమస్యతో సతమతమవుతున్న రామునాయుడు పురుగు మందు తాగినట్లు పేర్కొంది. మృతిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించినట్టు తెలిపారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన

సాక్షి, అనకాపల్లి: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే చెడు ప్రభావాల గురించి పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించి వాటి వినియోగాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నార్కోటిక్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లలో కూడా తనిఖీలు నిర్వహించాలన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్ అధ్యక్షతన, గ్రామస్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లాలో నాలుగు చెక్ పోస్టులు ఉన్నాయని, అదనంగా డైనమిక్ చెక్ పోస్టులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్వో బి.దయానిధి, ఆర్డీవోలు జయరాం, చిన్నికృష్ణ, కమిటీ సభ్యులు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు నర్సీపట్నం, పాయకరావుపేట దివ్యాంగులకు సదరం క్యాంపు



ఎన్టీఆర్ క్రీడామైదానంలో దివ్యాంగులకు సదరం క్యాంపు నిర్వహిస్తున్న వైద్యులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఎన్టీఆర్ వైద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం సబ్బవరం, కె.కోటపాడు మండలాలకు చెందిన దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందించేందుకు సదరం క్యాంపు నిర్వహించినట్టు వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాసరావు చెప్పారు. 74 మంది హాజరు కాగా 44మందిని అర్హులుగా గుర్తించామన్నారు. బుధవారం నర్సీపట్నం, పాయకరావుపేట మండలాల దివ్యాంగులకు సదరం క్యాంపు జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

మండల స్థాయి స్కూలు గేమ్స్ వాయిదా

కశింకోట: మండల స్థాయి స్కూలు గేమ్స్ ఒక రోజు వాయిదా పడ్డాయి. వీటిని ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజులపాటు బాల బాలికలకు నిర్వహించనున్నట్లు బాలికల హైస్కూలు పీడీ పెంటకోట కమల తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ తరఫున మొదటి రోజు బాలికలకు, ఈ నెల 20న బాలురకు ఖో–ఖో, కబడ్డీ, షటిల్, యోగా, చదరంగం వాలీబాల్ పోటీలు, ఈ నెల 21న బాల బాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. తమ పాఠశాలతోపాటు డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బాలబాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు. మండల స్థాయి విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ పోటీలు ఈ నెల 18న నిర్వహించాల్సి ఉందని, అయితే స్కూలు కాంప్లెక్స్ సమావేశం దృష్ట్యా వాయిదా వేసినట్లు తెలిపారు.

కామాక్షిదేవి రథం ఊరేగింపు


రథం ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొణతాల రాజేంద్ర

అనకాపల్లి: విశ్వకర్మ జయంతి వేడుకలను దేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని అనకాపల్లి గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర అన్నారు. స్థానిక గవరపాలెం కామాక్షి అమ్మ వారి ఆలయంలో విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కామాక్షిదేవి రథం ఊరేగింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణ పురవీధుల్లో రథం ఊరేగించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మూత్తుర్తి గంగారావు, పట్టణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, కార్యదర్శి కొమ్మోజి రాజు, కోశాధికారి పొన్నాడ వెంకట నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు నేడు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఉదయం 9.30 గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) మండల స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల శాఖ కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. బాలురు, బాలికల జట్లకు వేర్వేరుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు
మంగళవారం 200 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,610	4,950
రెండో రకం	3,480	3,510
మూడోరకం	3,250	3,350

అనకాపల్లి సినిమాలు

35..చిన్నకథకాదు	: రాజా
ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్	: సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
ఉత్సవం	: వెంకటేశ్వర
కళింగ	: శ్రీసత్య
భలేఉన్నాడే	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.


డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది


కశింకోటలోని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు సరఫరా


తేగాడలో కేజీబీవీ బాలికలకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నులి పురుగులతో రక్తహీనత

- రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయకర్త ప్రశాంతి
- విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ


బాలికలకు మాత్రలు అందజేస్తున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయకర్త ప్రశాంతి


బయ్యవరం వద్ద మదర్సాలో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేత

కశింకోట: శరీరంలో నులి పురుగులు ఉంటే రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడతాయని, వీటి నివారణకు అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వేసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయకర్త జె. ప్రశాంతి కోరారు. మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం 95 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. 1 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులకు, చిన్నారులకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు అందించి మింగించారు. ఈ సందర్భంగా తాళ్లపాలెంలోని డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయకర్త ప్రశాంతి మాట్లాడుతూ నులి పురుగుల వల్ల శారీరక, మానసిక ఎదుగుల లోపిస్తుందన్నారు. విద్యార్థులు శుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ గ్రేస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తేగాడలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూళ్లలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కశింకోట పీహెచ్‌సీ పరిధిలో 7,921 మంది విద్యార్థులు, చిన్నారులు ఉండగా, వారిలో 7,479 మందికి, తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో 7,216 మందికిగాను 6,854 మందికి మాత్రలు వేశారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 25న మాత్రలు మింగించనున్నట్లు హెల్త్ సూపర్ వైజర్లు సత్యనారాయణ, కె.ఎస్.ఆర్.కె. నరసింహారావు, ఎ.వి. సుబ్బారావు తెలిపారు. సూపర్ వైజర్లు సత్యవతి, రామ్మూర్తి, విజయలక్ష్మి సుభాని, రామకృష్ణ గుప్తా, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, ఎ.ఎన్.ఎం, పారా మెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


గోడ పత్రికను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

పరవాడ: సెజ్ కార్మికులు, ప్రజల భద్రతపై సీపీఎం ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి పరవాడ వరకు చేపట్టిన రక్షణ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా నాయకులు వి.వి.రమణ కోరారు. రక్షణ యాత్రలో భాగంగా చేపట్టిన బైక్ యాత్ర వాల్ పోస్టరును స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16న ప్రారంభమైన బైక్ యాత్ర 20న అచ్యుతాపురం చేరుకుంటుందన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు అచ్యుతాపురంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస భద్రత కరువైందన్నారు. ఏ కంపెనీలో ఏం జరుగుతుందోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నిర్వాసితులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సీపీఎం నాయకులు పి.మాణిక్యం, బంగారాజు, శ్రీసత్య పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం


వరద సహాయనిధికి విరాళం అందిస్తున్న లుపిన్ డీజీఎం హెచ్ఆర్ శ్రీనివాసరావు

పరవాడ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక జేఎన్ ఫార్మాలోని లుపిన్ పరిశ్రమ యాజమాన్యం రూ.2 లక్షలను సీఎం సహాయ నిధికి విరాళం అందించింది. ఈ మేరకు విరాళం చెక్కును జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డికి పరిశ్రమ డీజీఎం హెచ్ఆర్ శ్రీనివాసరావు మంగళవారం అందించారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఆర్థిక సాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ జేవీవీఎస్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.చిన్నారావు, లుపిన్ పరిశ్రమ ప్రతినిధి ఎస్.అప్పారావు, సేఫ్టీ మేనేజర్ కేదార్ మల్లా, డి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

అలరించిన ఇంద్రజాల ప్రదర్శన


ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న ప్రముఖ ఇంద్రజాలికుడు రవిశంకర్

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సింహాచలం ప్రాంతానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు రవిశంకర్ పలు రకాల ప్రదర్శనలతో అలరించారు. గాల్లో నుంచి పువ్వులు, పావురాలను తీసుకురావడంతోపాటు, కళ్లుమూసి తెరిచేలోగా వస్తువుల్ని మాయం చేసి అబ్బురపరిచారు. కాలనీలోని చిన్నారులు, నివాసితులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రదర్శనని తిలకించారు. కాలనీ నివాసితులు నడింపల్లి రామరాజు, యశ్వంత్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం


మల్లునాయుడుపాలెంలో గణష్ నిమజ్జనంలో పాల్గొన్న గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో సిద్ధి వినాయక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆరాధ్యుల సీతారామాంజనేయశాస్త్రి, ఆరాధ్యుల ప్రణయ్ శర్మ నిత్యం శాస్త్రోక్తంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. నిమజ్జనోత్సవంలో భాగంగా కోలాటం, మేళతాళాలు, భజన కార్యక్రమాలతో విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో పరసర గ్రామాల ప్రజలు, సిద్ధి వినాయక సంక్షేమ సంఘం సభ్యులు సత్యవరపు శ్రీనివాసు, గాజుల వెంకటరావు, సిరపరపు శ్రీను, గండి గణేష్, ఆరిపాక మహేష్ పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించలేదు


మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

గొలుగొండ : స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీలకు అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా అధికార పక్షంలో నేతలకు గౌరవం ఇవ్వడం పద్ధతి కాదని, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మణికుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వరి విత్తనాలు పంపిణీ వ్యవహారంలో వ్యవసాయ శాఖ సిబ్బంది స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పిలువకుండా అధికార టీడీపీ నేతలను పిలిచి విత్తనాలు పంపిణీ చేయడం తగదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబీషణ మాట్లాడుతూ తాగునీటి సమస్యలు లేకుండా అన్ని గ్రామాల్లో చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

పాడిపశువులతో రైతుల ఆర్థికాభివృద్ధి

జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి ప్రసాద్‌రావు


తగరంపూడిలో పశువులకు గర్భకోశ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


రైతుకు ఖనిజ లవణ మిశ్రమాన్ని ఉచితంగా అందజేస్తున్న పశుసంవర్థక శాఖ అధికారి ప్రసాద్

అనకాపల్లి: పాడిపశువుల ద్వారా కొంత ఆదాయం రావడంతో రైతుల ఆర్థికాభివృద్ధికి సహాయ పడుతుందని జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. విశాఖ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలో తగరంపూడిలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాడిపశువులకు వ్యాధుల సోకకుండా రైతులు దృష్టి సారించాలన్నారు. వ్యాధుల బారిన పడిన జీవాలను దగ్గరలో పశువైద్య శాఖాధికారిని సంప్రదించి, ఉచితంగా మందులు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు 26 ఆవులకు, 38 గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం రైతులకు ఖనిజ లవణ మిశ్రమాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ మోహన్‌రావు, ఏడీఆర్ బి.సౌజన్య, వైద్యులు బి.రామారావు, సీహెచ్.అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి కలశ పూజలు


కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు


అమ్మవారి ఆలయంలో కలశ పూజలు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులో కన్యకాపరమేశ్వరి ప్రతిష్ఠ శతజయంతి వేడుకల్లో భాగంగా భాద్రపద మాసం 8వ పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారి మూల విరాట్‌కు రేజేటి రామాచార్యులు పంచామృత అభిషేకాలు చేశారు. మండపంలో 81 కలశాలతో పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయక నిమజ్జనాలు


గోవిందరావు కాలనీ వద్ద ఊరేగింపు


ఎండ్లబండిపై వినాయకుని నిమజ్జన ఊరేగింపు


కశింకోటలోని అఫీషియల్ కాలనీలో పెద్ద వినాయకుని నిమజ్జనోత్సవ ఊరేగింపు


దేవతామూర్తుల వేషధారణతో ప్రదర్శన


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐలు విజయకుమార్, వెంకటనారాయణ

కశింకోట: వినాయక నిమజ్జనోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కశింకోటలో పలుచోట్ల నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామ వీధుల్లో ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేశారు. స్థానిక అఫీషియల్ కాలనీలోని సమగ్ర బాలికల వసతి గృహం వద్ద నెలకొల్పిన పెద్ద వినాయక విగ్రహాన్ని దేవతామూర్తుల వేషధారణ నృత్యాలు, యువకుల నృత్యాలతో బాణసంచా కాలుస్తూ గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శారదానదిలో నిమజ్జనం చేశారు. మేదర వీధిలోని వినాయకుని ఎడ్ల బండి పైన, గోవిందరావు కాలనీ వద్ద వినాయకుని వ్యాన్ పైన నృత్యాలు, డప్పులు, వాయిద్యాల నడుమ ఊరేగించి గవరపేట పెద్ద గుమ్మం వద్ద నదిలో నిమజ్జనం చేశారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుగుతున్నాయని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ తెలిపారు. స్థానిక చిన్ననాలుగు రోడ్ల జంక్షన్ వద్ద అనకాపల్లి గోల్డ్ మర్చంట్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని మంగళవారం వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ పరిధిలో వీధిలో యువత ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ట్రాఫిక్ సమస్యలు లేకుండా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించే సమయంలో కమిటీ సభ్యులు భక్తులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విగ్రహావిష్కరణ


మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తుమ్మిడి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆవిష్కరించారు. విశ్వేశ్వరయ్య సేవలు ప్రపంచానికి ఆదర్శమన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెచ్‌వోడీ కె.సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవో-2 పోస్టులు రద్దు చేయొద్దు

నర్సీపట్నం : ఎంఈవో-2 పోస్టులను రద్దు చేసి కాంప్లెక్స్ హెచ్ఎంకు అధికారాలు బదలాయించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పీఆర్టీయూ నర్సీపట్నం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు జి.వి.రమేష్‌లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


తులసీ పైడింనాయుడు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన రాజాన తులసీ పైడింనాయుడు అండర్-16 బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యార్థి తండ్రి వెంకటరావు మంగళవారం మీడియాకు తెలిపారు. వాడచీపురుపల్లి ముత్యమాంబ బాల్‌బాడ్మింటన్ క్లబ్ ద్వారా ఈ నెల 25న హర్యానాలో జరగనున్న పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పైడింనాయుడు ఆడనున్నట్లు పేర్కొన్నారు.

రైస్ దుకాణంలో చోరీ


దేశపాత్రునిపాలెంలో రైస్‌షాపు షట్టర్‌ను పెకిలించిన దృశ్యం

పరవాడ: దేశపాత్రునిపాలెంలో గ్రామ సచివాలయం కింద శివసాయి ఎంటర్‌ప్రైజెస్ రైస్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఈ దొంగతనంలో కౌంటర్‌లో భద్రపర్చిన రూ.8 వేల నగదును దుండగులు దొంగిలించుకుపోయారు. సోమవారం రాత్రి షాపు మూసి, యజమాని ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చి చూడగా షట్టర్ పెకిలించి ఉండటాన్ని గుర్తించాడు. లోపల కౌంటర్లో ఉంచిన రూ.8 వేలు నగదు అపహరించినట్లు పరవాడ పోలీసులకు దుకాణం యజమాని మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు


నరసింగబిల్లిలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ శ్రేణుల పూజలు

కశింకోట: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నరసింగబిల్లిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మోదీ పేరిట ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు కరక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు ఉప్పలపు చిట్టిబాబు, అప్పికొండ అప్పారావు, కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. చిరంజీవి, అయినా శ్రీను, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు కచ్చాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.